తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
19 అక్టోబర్ 2026
పేజీలు : 08
Follow :

గిట్టుబాటు ధర లేక చామంతి రైతు కన్నీటి పర్యంతం

- రూ.6 లక్షల పెట్టుబడి మార్కెట్‌లో పడిపోయిన పూల ధరలు
- అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతు ఆవేదన

చేవెళ్ల, అక్టోబర్ 30 (జనంసాక్షి) ఆరుగాలం శ్రమించి, అప్పులు చేసి పండించిన పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో చామంతి రైతు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. పంట సాగు కోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టినా, కనీసం కూలీల ఖర్చులు కూడా చేతికి రాకపోవడంతో అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతు ఆందోళన చెందుతున్నారు. చేవెళ్ల మండల పరిధిలోని ఆలూరు గ్రామానికి చెందిన రైతు కొండకల రాజు తనకున్న మూడు ఎకరాల భూమిలో చామంతి పూల సాగు చేపట్టారు. ఒక్కో మొలకకు రూ.2 చొప్పున చెల్లించి సుమారు రూ.15 వేలతో నారు కొనుగోలు చేశారు. డ్రిప్ ఇరిగేషన్ పైపులు, ఎరువులు, పురుగుమందులు, దుక్కి దున్నకం, కలుపు తీత, కూలీల ఖర్చులు తదితర వాటి కోసం ఇప్పటివరకు సుమారు రూ.6 లక్షలు పెట్టుబడి పెట్టారు. ఎంతో కష్టపడి పంటను సాగు చేయడంతో దిగుబడి ఆశాజనకంగా వచ్చినప్పటికీ మార్కెట్‌లో చామంతి పూలకు సరైన ధర లేకపోవడంతో రైతు ఆశలు అడియాసలయ్యాయి. పూలను కోసి మార్కెట్‌కు తరలిస్తున్నా కనీస ధర పలకకపోవడంతో పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేకుండా పోయింది.

కూలీల ఖర్చులు కూడా చేతి నుంచే చెల్లించాల్సిన పరిస్థితి ఈ సందర్భంగా రైతు కొండకల రాజు తన ఆవేదనను వ్యక్తం చేస్తూ.. మొక్కలు నాటినప్పటి నుంచి పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ సుమారు రూ.6 లక్షల వరకు అప్పులు చేసి పెట్టుబడి పెట్టానని తెలిపారు. తీరా పంట చేతికొచ్చాక పూలు కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే కనీస ధర కూడా రావడం లేదన్నారు. పూలు కోసిన కూలీలకు కూలి డబ్బులు చెల్లించడంతో పాటు రవాణా ఖర్చులు కూడా చేతి నుంచే భరించాల్సి వస్తోందని వాపోయారు. పెట్టిన పెట్టుబడి, చేసిన అప్పులు ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. పంట బాగా పండినా గిట్టుబాటు ధర లేక నష్టాలపాలవుతున్న తమలాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, చామంతి పూలకు సరైన మార్కెట్ ధర కల్పించేలా చర్యలు తీసుకోవాలని రైతు కోరుతున్నారు.

జూబ్లీహిల్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్ రాగి ప్లేట్ చోరీ.. మహిళ అరెస్ట్

మరో ఆరుగురు పరారీ.. మరో చోరీ యత్నంలోనూ నిందితురాలి పాత్ర

అమీర్‌పేట / జూబ్లీహిల్స్, అక్టోబర్ 30 (జనం సాక్షి): జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న సుమారు 50 కిలోల న్యూట్రల్ కాపర్ ప్లేట్‌ను చోరీ చేసిన కేసులో ఒక మహిళను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ చోరీలో మరో ఆరుగురు నిందితులు పాల్గొన్నట్లు గుర్తించగా, వారు ప్రస్తుతం పరారీలో ఉన్నారు.

పోలీసుల వివరాల ప్రకారం.. ఈ నెల 28వ తేదీ తెల్లవారుజామున 4.30 గంటల సమయంలో ఏడుగురు నిందితులు ఆటోలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లోని స్వర్గ్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రాంగణానికి చేరుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతంలోని గేటు తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించి సుమారు 50 కిలోల రాగి ప్లేట్‌ను అపహరించారు. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టిన పోలీసులు, విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ మెట్రో స్టేషన్ సమీపంలో కేతావత్ జాని అలియాస్ సిరి అలియాస్ శిరీష (43)ను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో తన సహచరులతో కలిసి చోరీకి పాల్పడినట్లు ఆమె వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు. ఈమెపై గతంలో వివిధ పోలీస్‌స్టేషన్లలో నాలుగు చోరీ కేసులు నమోదైనట్లు గుర్తించారు. మిగిలిన ఆరుగురు నిందితులు సునీత, దేవి, పద్మ, నీలావతి, పాండు, దేవి బావమరిది పరారీలో ఉన్నారు.ఇదే ముఠా ఈ నెల 29వ తేదీన జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 10లోని అంతేరా కిచెన్ అండ్ బార్ వద్ద జనరేటర్ గది తాళం పగులగొట్టి లోపల ఉన్న బ్యాటరీలను చోరీ చేసేందుకు ప్రయత్నించినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. అయితే వాచ్‌మన్ అకస్మాత్తుగా అక్కడికి రావడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ఘటనపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 689/2026గా మరో కేసు నమోదు చేశారు. ప్రస్తుతం అరెస్టయిన నిందితురాలిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. పరారీలో ఉన్న మిగిలిన ఆరుగురిని పట్టుకోవడంతో పాటు చోరీకి గురైన రాగి ప్లేట్‌ను స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రెండు కేసుల్లోనూ దర్యాప్తు కొనసాగుతోంది.

దేవనూర్ సర్పంచ్ అభ్యర్థనకు డీఈఓ సానుకూలం

- మరి బషీర్‌మియా తాండ విద్యార్థుల పరిస్థితి ఏంటి?
- 40 మంది విద్యార్థులకు ఒక్క ఉపాధ్యాయురాలే దిక్కు..
- ఉపాధ్యాయ నియామకంపై ఎదురుచూపులు

యాలాల అక్టోబర్ 31 (జనంసాక్షి) : ఉపాధ్యాయుల వర్క్ అడ్జస్మెంట్ వ్యవహారంలో దేవనూర్ గ్రామ సర్పంచ్ రేణుకాదేవి కిషన్‌రావు విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని డీఈఓను కలిసి తమ గ్రామ ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేయవద్దని కోరినట్లు తెలిపారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందించి ఎంఈఓతో మాట్లాడతానని తెలిపినట్లు వెల్లడించారు.అయితే దేవనూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థనపై అధికారులు సానుకూలంగా స్పందించిన నేపథ్యంలో, అదే మండలంలోని బషీర్‌మియాతాండ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల పరిస్థితిపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే సుమారు 40 మంది విద్యార్థులు

లోపలి పేజిలో

అర్హులైన పట్టభద్రులంతా కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

లోపలి పేజిలో

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం మనందరి బాధ్యత: తలసాని

- 'వనం-పీవీ ఘనం' పుస్తకాన్ని ఆవిష్కరించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా

అమీర్‌పేట్ / బేగంపేట, అక్టోబర్ 30 జనం సాక్షి: పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం మనందరి బాధ్యత అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం బేగంపేటలోని శ్రీ రామానంద తీర్థ మెమోరియల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి రచించిన 'వనం--పీవీ ఘనం' పుస్తకాన్ని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, వాతావరణ కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటి, వాటిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఔషధ మొక్కల ప్రాముఖ్యత, ప్రకృతి పరిరక్షణ అంశాలను తెలియజేస్తూ వాణీదేవి రచించిన ఈ పుస్తకం సమాజానికి మంచి సందేశాన్ని అందిస్తుందని పేర్కొన్నారు. ప్రజల్లో ప్రకృతి పట్ల గౌరవాన్ని, పర్యావరణ పరిరక్షణపై చైతన్యాన్ని మరింత పెంపొందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేశారని గుర్తుచేశారు. ఆయన ఆశయాల స్ఫూర్తితో కుమార్తె వాణీదేవి ముందుకు సాగడం అభినందనీయమన్నారు. శ్రీ రామానంద తీర్థ మెమోరియల్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు విద్యాబోధనతో పాటు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి వైస్ చైర్మన్ బండ ప్రకాష్, మాజీ కార్పొరేటర్ టి. మహేశ్వరి, నిర్వాహకులు ప్రభాకర్, చంద్రశేఖర్, నాయకులు టి. శ్రీహరి, శ్రీనివాస్ గౌడ్, శేఖర్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఐక్యత కోసం పాదయాత్ర, సైకిల్ ర్యాలీ

అల్వాల్, అక్టోబరు 30 (జనంసాక్షి): సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని +ూ2జూ2 సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో నవంబరు 1న ఆదివారం అల్వాల్‌లో పాదయాత్ర, సైకిల్ ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 6.30 నుంచి 8 గంటల వరకు ఓల్డ్ అల్వాల్ హెచ్‌టీ రోడ్డులోని బతుకమ్మ పార్కు వద్ద కార్యక్రమం ప్రారంభం కానుందని క్లబ్ ప్రతినిధి భోగ విష్ణుమూర్తి తెలిపారు. ఇప్పటికే పాఠశాలలు, కళాశాలలు, యోగా సంస్థలు, క్రీడాకారులకు ఆహ్వానం పలికామని చెప్పారు. జాతీయ ఐక్యత, సమగ్రత సందేశాన్ని చాటే ఈ కార్యక్రమంలో అల్వాల్ పట్టణ ప్రజలు, యువత, విద్యార్థులు కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని పాదయాత్ర, సైకిల్ ర్యాలీని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

చలో ఢిల్లీకి కేశంపేట కాంగ్రెస్ నేతలు

కేశంపేట, అక్టోబర్ 30 (జనం సాక్షి) : దేశ రాజధాని ఢిల్లీ రామ్ లీలా మైదానంలో నవంబర్ ఒకటవ తేదీన ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఓటు బచావో.. దేశ్ బచావో పేరుతో నిర్వహించబోయే ర్యాలీకి కేశంపేట మండల కాంగ్రెస్ పార్టీ నేతలు శుక్రవారం బయలుదేరి వెళ్లారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరగబోయే చలో ఢిల్లీకి షాద్ నగర్ పట్టణం నుండి ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఢిల్లీకి వెళ్లే బస్సును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ జండా ఊపి ప్రారంభించారు. ఢిల్లీకి వెళ్లిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అనుమగల్ల రమేష్, సర్పంచులు చెదురువెల్లి భాస్కర్ గౌడ్, ఎదిరే నాగేశ్వర్, కొట్టం నరేందర్ రెడ్డి, నాయకులు బీస కరుణాకర్ రెడ్డి, గోపని భీమయ్య, హరీశ్వర్ రెడ్డి ఉన్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలని, కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం పోరాటం చేస్తుందని వారు అన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్సీ

కేశంపేట, అక్టోబర్ 30 (జనం సాక్షి): మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కె. అనూష కు మంజూరైన 60 వేల, వినయకు మంజూరైన 60 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ సురభి వాణిదేవి అందజేశారు. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ప్రత్యేక చొరవతో ఎమ్మెల్సీ వాణీ దేవి సహకారంతో చెక్కులు మంజూర అయినట్టు గ్రామ యువ నాయకులు కానం ప్రేమ్ కుమార్ గౌడ్ తెలిపారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల, కార్యకర్తల సంక్షేమం కోసం కృషి చేస్తున్న నాయకుడు అంజయ్య యాదవ్ అని ప్రేమ్ కుమార్ కొనియాడారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీకి, మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కర్నెకోట నరేష్, నాయకులు కంది రాఘవేందర్, దశరథ్, తేజ యాదవ్, హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

మోమిన్‌పేటలో మండల స్థాయి సమీక్ష సమావేశం

మోమిన్‌పేట అక్టోబర్ 30(జనం సాక్షి)మండల పరిషత్ కార్యాలయంలోశుక్రవారం మండల స్థాయి సమీక్ష సమావేశం, సమర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. మండల స్పెషల్ అధికారి సదానందం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ఏఎంసీ చైర్మన్ మహేందర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ శంకర్ యాదవ్ లు హాజరయ్యారు.ఈ సమావేశంలో మండలంలోని గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల పనితీరుపై సమీక్ష నిర్వహించి పలు కీలక అంశాలపై చర్చించారు.ముఖ్యంగా రాబోయే ఐదు నుంచి ఆరు నెలల పాటు వేసవికాలంలో తలెత్తే తాగునీటి సమస్యలను ముందుగానే గుర్తించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టడంపై చర్చించారు. అలాగే ఎల్‌నినో ప్రభావం, విద్యుత్ శాఖకు సంబంధించిన సమస్యలు, నీటి లభ్యత, గ్రామాల్లో తాగునీటి సరఫరా పరిస్థితులపై సమీక్షించారు.వివిధ శాఖల అధికారులు తమ పరిధిలోని పనుల పురోగతిని వివరించారు. రానున్న రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని, గ్రామాల్లో సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన పి ఎస్ సి ఎస్ చైర్మన్ శంకర్ యాదవ్ ను ఎన్నిక అయినందున మండల కార్యదర్శిలందరు శాలువాలతో సన్మానించారు ఇంకుడు గుంత విషయంలో మండలంలోనే మేక వనం పల్లి గ్రామాం మొదటి స్థానంలో ఉన్నందున ఎంపీడీవో సృజన సాహిత్య సర్పంచ్ను, కార్యదర్శిని, ఫీల్డ్ అసిస్టెంట్ ను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మునిరోద్దిన్,సుపర్ డెంట్ రాజమలప్ప, ఎంపిఓ సంజయ్ కుమార్,వివిధ శాఖల అధికారులు, గ్రామ సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు

భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక కార్యాచరణ. క్షేత్రస్థాయిలో పనుల పరిశీలన

జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి హిరణ్మయి

ధారూర్,అక్టోబర్ 30 (జనంసాక్షి)భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వహణ అధికారి హిరణ్మయి పిలుపునిచ్చారు. శుక్రవారం ధారూర్ మండల కేంద్రంతో పాటు రుద్రారం,నాగసముందర్ గ్రామాల్లో ఆమె విస్తృతంగా పర్యటించి భూగర్భ జలాల పెంపునకు చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.వీబీజీ రామ్‌జీ పథకం కింద ధారూర్ అటవీ ప్రాంతంలో చేపట్టిన కందకాల నిర్మాణ పనులతో పాటు రుద్రారం, నాగసముందర్ గ్రామాల్లో పామ్‌పాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..వాతావరణ మార్పులు,వర్షపాతం పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి గ్రామంలో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకేలా ప్రత్యేకంగా ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టి పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల భూగర్భ జలమట్టం పెరిగే అవకాశం ఉంటుందని, ఈ విషయంపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.వీబీజీ రామ్‌జీ పథకం కింద చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని మండల స్థాయి అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాల పెంపు కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజల భాగస్వామ్యంతోనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి. నర్సిములు,ఏపీఓ రాములు,ఈసీ రమేష్, సాంకేతిక సహాయకులు, ఆయా గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

భారతదేశ అను శాస్త్ర రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన చిరస్మరణీయుడు డాక్టర్ ఓంజైబాబా

ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి

కాప్రా, అక్టోబర్ 30 (జనం సాక్షి) : భారతదేశ అను శాస్త్ర రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్లిన చిరస్మరణీయుడు డాక్టర్ ఓం జై బాబా అనే ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో పద్మభూషణ్ డాక్టర్ హోమీ జే బాబా 117వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి గారు, ఎన్‌ఎఫ్సీ సీనియర్ నాయకులు ఉదయ భాస్కర్ గారు డాక్టర్ హోమీ జే బాబా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ డాక్టర్ హోమి జే బాబా భారతదేశం అణురంగంలో శాంతియుత ప్రయోజనాల కొరకు ఎంతో కృషి చేశారని చెప్పారు. దేశ స్వావలంబన కొరకు జీవితకాలం కృషి చేశారని అన్నారు. అణు శక్తి రంగంలోనే కాకుండా ఎలక్ట్రానిక్స్ రంగులోను, భౌతిక శాస్త్రంలోనూ ఎన్నో ప్రయోగాలు చేసి నూతన ఆవిష్కారాలు చేశారని చెప్పారు. వారి కృషి ఫలితంగా వచ్చిన ఎన్ ఎఫ్ సి, ఈసీఐఎల్ సంస్థల ద్వారా మొత్తం మన ఏరియా అంతా సుభిక్షంగా తయారైందని అన్నారు. స్ఫూర్తి గ్రూప్ సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ గారు మాట్లాడుతూ డాక్టర్ ఒమీ జే బాబా ఉన్నతమైన పార్సీ కుటుంబంలో జన్మించినప్పటికీ భారతదేశ ఔన్నత్యాన్ని నిలపడం కోసం సామాన్య ప్రజలకు విజ్ఞాన ఫలాలు అందించడం కొరకు సుదీర్ఘకాలం కృషి చేశారని చెప్పారు. లండన్ లో ఉన్నత చదువు చదివినప్పటికీ భారతదేశంలో పూర్తి సామర్థ్యం తోటి ప్రజా అనుకూల ఆవిష్కరణలు చేశారని చెప్పారు. డాక్టర్ ఏఎస్ రావు గారు హోమి జే బాబా ను తన గురువుగా అన్ని సందర్భాల్లో చెప్పే వారిని చెప్పారు. స్వాతంత్ర అనంతరం దేశాన్ని అభివృద్ధి పరచాలంటే అన్ని రంగాలలో స్వయం సమృద్ధి సాధించాలని దాని కోసం అహర్నిశలు కృషి చేశారు. భారతదేశం అణురంగంలో అభివృద్ధి ఇవ్వడం ఇష్టపడని అమెరికా సీఐఏ కుట్రతో విమాన ప్రమాదంలో చంపేశారని చెప్పారు. హోమీ జయంగీర్ బాబా విజ్ఞానం ఒకటే కాకుండా కళా రంగంలోనూ కూడా ఆయనకు ప్రవేశం ఉందని చెప్పారు. భారతదేశంలో ప్రసిద్ధి చెందిన కళాకారుల సంస్థ ఇఫ్టా పేరును ఆయనే ప్రతిపాదించారని చెప్పారు. ప్రజా జీవనంలో ప్రజలకు అందుబాటులో ఉండే జీవనశైలి గలిగిన గొప్ప దార్శనీకుడని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ప్రతినిధులు గొడుగు యాదగిరిరావు జి శివరామకృష్ణ బిఆర్ఎస్ నాయకులు మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు , నాయకులు కాసం మహిపాల్ రెడ్డి , చల్లా లీలావతి, శారద, శ్రావణ్ కుమార్, బాలు, ప్రభాకర్, వెంకటేశ్వరరావు, శ్రీమన్నారాయణ, పాషా, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న రాయితీ సౌకర్యాన్ని క్షేత్రస్థాయిలో ప్రతి రైతు వినియోగించుకోవాలి

రైతులకు స్ప్రింకర్లు, పైపులు అందజేసిన అధికారులు,నాయకులు

బొంరాస్ పేట, అక్టోబర్ 30 (జనం సాక్షి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో 112 మంది రైతులకు స్ప్రింకర్లు,పైపులు ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి విజిజిరాంజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నర్సింలు గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్ రాములు గౌడ్ అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల సంక్షేమం వ్యవసాయ అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తూ వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు.ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీని క్షేత్రస్థాయిలో ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.రైతులకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం ఆధునిక వ్యవసాయ పరికరాల వినియోగంపై అధికారులు అవగాహన కల్పించాల న్నారు.ఎల్ నినో ప్రభావం కారణంగా వాతావరణంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా వ్యవసాయ రంగంలో రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నీటి వనరులను పొదుపుగా వాడుకోవాలన్నారు. త్వరలో మరింత మంది రైతులకు స్ప్రింకర్లు, పైపులు అందజేస్తామన్నారు. ఇంకా

మిగిలిన రైతులు దరఖాస్తు చేసుకొని సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ ఉద్యానవన శాఖ అధికారి ఆర్,సురేంద్రనాథ్,ఎంపీవో రవి నాయక్, జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రామ్ రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లేష్, సర్పంచులు వీరేశలింగం,లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంతోష్ నాయక్, కాశప్ప,ఆయా గ్రామాల ఉపసర్పంచులు,వార్డులు సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర కన్వీనర్‌గా శాగంటి వెంకటేష్ నియామకం

జవహర్ నగర్: అక్టోబర్ 30 : (జనంసాక్షి)తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రాష్ట్ర కన్వీనర్‌గా శాగంటి వెంకటేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ నాయకులు ఆయనకు నియామక బాధ్యతలు అప్పగించి అభినందనలు తెలిపారు. రజకుల హక్కుల సాధన, సామాజిక న్యాయం, ఎస్సీ వర్గీకరణలో రజకులకు తగిన గుర్తింపు కల్పించే అంశాలపై సమితి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబరాజు కుమార్ మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా రజకుల జీవితాల్లో ఆశించిన స్థాయిలో సామాజిక, ఆర్థిక మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలనే అంశంపై ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.2016 డిసెంబర్ 26న అప్పటి కొడంగల్ ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గోపి రజక గుర్తుచేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్ రెడ్డి ఈ అంశంపై తన వైఖరిని స్పష్టం చేయాలని కోరారు.రాష్ట్ర కన్వీనర్ శాగంటి వెంకటేష్ మాట్లాడుతూ.. 56/1984 ఆర్డినెన్స్‌కు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ, రజకుల సామాజిక హోదా, రిజర్వేషన్ల సమస్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముందుకు వచ్చి, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చే అంశంపై తెలంగాణ అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంపై రాజకీయ, చట్టపరమైన ఒత్తిడి తీసుకువచ్చి రజకుల చిరకాల డిమాండ్ పరిష్కారానికి

కృషి చేయాలని కోరారు.రజకుల సామాజిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధికి ఎస్సీ హోదా అంశం ఎంతో కీలకమని, ఈ సమస్యను ఇకపై వాయిదా వేయకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని గోపి రజక డిమాండ్ చేశారు.సమితి మేడ్చల్ జిల్లా కమిటీ విస్తరణలో భాగంగా జిల్లా ఉపాధ్యక్షుడిగా మైలారం ఉపేందర్, జిల్లా ముఖ్య సలహాదారుగా చిట్యాల సత్తయ్య, కాప్రా మండల సంయుక్త కార్యదర్శిగా పూజారి రామన్నలను నియమించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం అధ్యక్షుడు బసవరాజ్, రాష్ట్ర మీడియా యూత్ సెక్రటరీ రాపర్తి అజయ్, మేడ్చల్ జిల్లా యువజన అధ్యక్షుడు పోలాస సాయి కుమార్, జిల్లా సంయుక్త కార్యదర్శి పోలాస అశోక్, కాప్రా మండల అధ్యక్షుడు పోలాస కిరణ్ కుమార్, ఉపాధ్యక్షులు ఓరుగంటి చంద్రమౌళి, సిహెచ్ సత్తయ్య, ఇ.రాజు, వడ్లకొండ దుర్గయ్య, శోభన్, ఎదునూరి రాజు, సింగారం నరసింహ, మైలారం ఎల్లమ్మ, నరసమ్మ, బుచ్చమ్మ, కోమల, లాస్య తదితర రజక సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాషా నరహరి వర్ధంతి సభను జయప్రదం చేయండి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

స్థూపావిష్కరణకు సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ

రంగారెడ్డి, అక్టోబర్ 30 (జనంసాక్షి) కామ్రేడ్ మహబూబ్, పాషా, నరహరి గార్ల 37వ వర్ధంతి బహిరంగ సభను ప్రజలు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో నిర్వహించిన సీపీఎం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాన్ వెస్లీ మాట్లాడుతూ... రంగారెడ్డి జిల్లా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాతలు పాషా నరహరి వర్ధంతిని పురస్కరించుకుని జాపాల గ్రామంలో స్మారకార్థం 50 అడుగుల భారీ స్మారక స్థూపాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ స్థూప ప్రారంభోత్సవ కార్యక్రమానికి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ హాజరవుతున్నారని తెలిపారు. ఈ ప్రాంతంలో పేద ప్రజల హక్కుల కోసం,

భూస్వాముల దౌర్జన్యాలను ఎదిరించి ప్రజలను చైతన్యపరిచి పోరాటాలు నిర్వహించిన విప్లవ యోధుల స్ఫూర్తితోనే సీపీఎం భవిష్యత్ పోరాటాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు.రాష్ట్రంలో ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాన్ వెస్లీ మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందన్నారు. ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందని, ముందస్తు నివారణ చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే అనేక జిల్లాల్లో నీరు అందక పంటలు ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎండిపోయిన పంటలను వెంటనే సర్వే చేసి రైతులకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే రేషన్ షాపుల ద్వారా పేదలకు 14రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బోడ సామేల్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాడిగళ్ళ భాస్కర్, ఎం. చంద్రమోహన్, డి. జగదీష్, జి. కవిత, ఇ. నర్సింహతో పాటు జిల్లా కమిటీ సభ్యులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

తెలంగాణ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పత్తేపురం ప్రవీణ్ నియామకం

ఎల్బీనగర్ అక్టోబర్ 30 (జనం సాక్షి)తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో తెలంగాణ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా పత్తేపురం ప్రవీణ్ నియమించడం జరిగింది ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు.

ఎలివేటెడ్ కారిడార్‌తో ఉపాధికి ముప్పు!

అడిషనల్ కలెక్టర్‌కు రైతులు, వ్యాపారుల వినతి

అల్వాల్, అక్టోబరు 30 (జనంసాక్షి): ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంతో అల్వాల్ రైతుబజార్ వద్ద జీవనోపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడుతోందని రైతులు, చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం అల్వాల్ తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కారిడార్ నిర్మాణంతో ఉపాధి కోల్పోయే పరిస్థితి రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో షేక్ గౌస్, ఎం. సత్యం, రాకేష్ రెడ్డి, ఉప్పలయ్య, నరసింహారెడ్డి, శ్రీనివాస్, ప్రవీణ్, కుమార్ రెడ్డి, రాణి, ఆండాలు, సునీత, బుచ్చమ్మ, వీణ, హైమావతితో పాటు పలువురు రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

తెలంగాణ మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జిలతో నిరసన

పరిగి అక్టోబర్ 30 జనం సాక్షి:ప్రభుత్వం తెలంగాణ మోడల్ స్కూల్ లో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది,అతిథి ఉపాధ్యాయుల సమస్యలుఅయినా.హెల్త్ కార్డులు, కారుణ్య నియామకాలు, సీపీఎస్ డెత్ గ్రాట్యూటీ, విద్యాశాఖ లో విలీనం, టీజీటీ లకు నోషనల్ బెనిఫిట్స్, డి ఏ బకాయిలు, పిఆర్సి వర్తింప చేయడం వంటి సమస్య లనువీలు అయినంత త్వరగా పరిష్కారం చేయాలని నల్లబ్యాడ్జిలతో ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేసారు.

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన పరిగి మోడల్ స్కూల్ విద్యార్థి

పరిగి అక్టోబర్ 30 జనం సాక్షి :వికారాబాద్ జిల్లా పరిగి మోడల్ స్కూల్ విద్యార్థి ఎండీ అస్లాం రాష్ట్ర స్థాయి లో నిర్వహించిన ఎస్జిఎఫ్ అండర్ 17 క్రికెట్ టోర్నమెంట్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తరఫున ఆడి సత్తా చాటడా. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్య లక్ష్మి, ఉపాధ్యాయ బృందం, పీడీ అభినందనలు తెలుపుతూ,ఇంకా బాగా కష్టపడి జాతీయ స్థాయి లో ప్రతిభ కనబరుస్తాడని ఆకాంక్షించారు.

ఎఫ్ఎల్ఎన్ అమలు తీరు పరిశీలించిన చౌదర్పల్లి క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్

బొంరాస్ పేట, అక్టోబర్ 30 (జనం సాక్షి): మండల పరిధిలోని లింగన్ పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం చౌదర్పల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్ సందర్శించారు .పాఠశాలలో నిర్వహిస్తున్న పలు రకాల రికార్డులను తనిఖీ చేశారు. 2వ,3వ తరగతి విద్యార్థుల తెలుగు,గణితంకు సంబంధించిన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఎఫ్ఎల్ఎన్ అమలు తీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు శ్రీహరి, ఉపాధ్యాయురాలు అమూల్య,విద్యార్థులు ఉన్నారు.

నవంబర్ 4న బొంరాస్ పేట మండల స్థాయి సమీక్ష సమావేశం

మండల పరిషత్ అభివృద్ధి అధికారి దయానంద్

బొంరాస్ పేట, అక్టోబర్ 30 (జనం సాక్షి): మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులపై నవంబర్ 4న ఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో మండల ప్రత్యేక అధికారి మాధవరెడ్డి అధ్యక్షతన మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దయానంద తెలిపారు. సెప్టెంబర్ 26 నుండి ఇప్పటివరకు వివిధ శాఖల పరిధిలో జరిగిన అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికను ఎంపీడీవో కార్యాలయంలో నవంబర్ రెండవ తేదీలోగా అందజేయాల న్నారు.మండల స్థాయి సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు సమయాన కూలంగా విధిగా హాజరు కావాలన్నారు.

నేడు చెంగిచెర్ల ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డీఎం'

బోడుప్పల్-జనంసాక్షి:ప్రయాణికుల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు చెంగిచెర్ల ఆర్టీసీ డిపోలో నేడు 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎస్. స్వాతి తెలిపారు. డిపో పరిధిలోని వివిధ రూట్లలో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ఫిర్యాదులు, సలహాలు, సూచనలను స్వీకరించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. ప్రయాణికులు నేడు ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డిపో మేనేజర్ సెల్ నంబర్ 78930 88433కు ఫోన్ చేసి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు. ప్రయాణికుల సూచనల మేరకు సేవలను మరింత మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్షిప్ పోటీలు

రాజేంద్రనగర్,అక్టోబర్30(జనంసాక్షి)షేక్‌పేట్ జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షేక్‌పేట్ బాక్సింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 10వ ఎలైట్ మెన్ అండ్ ఉమెన్స్ హైదరాబాద్ జిల్లా బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి, సిద్ధప్ప తదితరులు హాజరయ్యారు. తెలంగాణ బాక్సింగ్ ఉపాధ్యక్షుడు బీడీ మన్మోహన్, ప్రధాన కార్యదర్శి బల్ బహదూర్ సింగ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి వినేష్ బాబు, ప్రముఖ బాక్సర్ నిఖత్ జరీన్ తండ్రి జమీల్ అహ్మద్ పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ క్లబ్‌లకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. విజేతలు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పాల్గొననున్నారు.

కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత

రాజేంద్రనగర్,అక్టోబర్30(జనంసాక్షి)కాంగ్రెస్ పాలనలో ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, రైతులకు పంట నష్టపరిహారం, పెట్టుబడి సాయం అందించడంలో ప్రభుత్వం విఫలమైందని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులు, నిత్యావసర ధరల పెరుగుదల, తాగునీటి సమస్యలు, విద్యుత్ కోతలతో ప్రజలు అల్లాడుతున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కాంగ్రెస్ నేతలు రాజకీయాలకే ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు మద్దతు తెలిపిన నాయకులు.. దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లు, డూప్లికేట్ ఓట్లను తొలగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్య వ్యవస్థలపై బురద చల్లడం మానుకోవాలని హితవు పలికారు. దేశంలో ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక యూత్ ప్రెసిడెంట్ దేశపాగా కిరోసిన్ రాజు, కరణం నారాయణ ముదిరాజ్, వేముల శ్రీనివాస్, బాలరాజ్ ముదిరాజ్, కోరణి శ్యామ్ కుమార్, ఆనంద్ శర్మ, శశిధర్, వినోద్, నరేందర్, శ్రీనివాస్, గౌతమ్, శ్రీకర్ తదితరుల ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు.

పార్టీలో చేరిన వారికి నాయకులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గోల్కొండ--గోషామహల్ జిల్లా ఇన్‌చార్జి వై. శ్రీధర్, వనపర్తి జిల్లా ఇన్‌చార్జి బొక్క బల్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, బుక్క వేణుగోపాల్, ఎం. కొమురయ్య, జి. బాబురావు, పులిమామిడి రవీందర్, గూడెం వెంకట్ రెడ్డి, సులిగే వెంకటేష్, కర్ణం నర్సింహా ముదిరాజ్, జి. రవి, నర్సింహా, రెంటాల పవన్ రాజ్, జ్ఞానేశ్వర్, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ కోతలను నివారించాలి

బీఆర్ఎస్ నాయకులు జిల్లా నాయకులు చీరాల రమేష్

రంగారెడ్డి, అక్టోబర్ 30 (జనంసాక్షి)మంచాల మండలంలో కరెంట్ కోతలను వెంటనే నివారించాలని, వర్షాభావ పరిస్థితుల వల్ల పంటలు ఎండిపోయినందున మంచాల మండలాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలని బీఆర్ఎస్ జిల్లా నాయకులు చీరాల రమేష్ డిమాండ్ చేశారు.శుక్రవారం మంచాల మండల కేంద్రంతో పాటు జాపాల, ఆరుట్ల గ్రామాల్లో నీళ్లు లేక ఎండిపోయిన పంట పొలాలను బీఆర్ఎస్ పార్టీ బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఈ సందర్భంగా రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. వర్షాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, కనీసం బోరు బావుల ఆధారంగా తిండి గింజల కోసమైనా పంట పండించుకుందామంటే లో-వోల్టేజ్ సమస్య వేధిస్తోందని రైతులు ఆందోళనకు వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు . కరెంట్ సరిగ్గా లేక బోర్ మోటార్లు కాలిపోతుండటంతో తీరని నష్టం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు. ఎండిపోయిన పంటలకు వెంటనే పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉండి ప్రభుత్వంపై ముందుండి ప్రజా పోరాటాలు నిర్వహిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలోమాజీ ఏఎంసీ చైర్మన్ ఏరపుల చంద్రయ్య,

మాజీ సొసైటీ చైర్మన్ మొద్దు సికిందర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ఇందిర, మాజీ వైస్ చైర్మన్ దండేట్కర్ రవి, మాజీ డైరెక్టర్ జంబుల, పిసి తండా మాజీ సర్పంచ్ రాజు నాయక్, కిషన్ రెడ్డి, సర్పంచులు శోభ కుమార్, మంచాల రవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చిందం రఘుపతి, మొర్రి ఐలయ్య, మాడుగుల బాలమణి, పున్నం రాము, జీఎమ్‌పిఎస్ చైర్మన్ చిందం జంగయ్య, బకున చందు, ఆకారం కృష్ణ, లచ్చిరాం, ఆవుల శ్రీను, గుంతండ్ల మల్లేష్, బర్మల వెంకటేష్, కాటి కృష్ణ, అశ్వాల బాలరాజ్, మెగావత్ గణేష్, నోముల మధు తదితరులు పాల్గొన్నారు.

రాళ్ల గుడుపల్లి సర్పంచ్ వర్త్య మహిపాల్ అక్రమాలకు పాల్పడుతున్నాడు

గ్రామస్తుల ఆరోపణ

మోమిన్ పేట అక్టోబర్ 30 (జనం సాక్షి)రాళ్ల గుడుపల్లి గ్రామ సర్పంచ్ వర్త్య మహిపాల్ అరాచకాలు గ్రామంలో రోజురోజుకు విపరీతంగా పెరిగిపోతు న్నాయని రాళ్ల గుడుపల్లి గ్రామస్తులు ఆరోపించారు, శుక్రవారం గ్రామంలోని ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గ్రామస్తులు వార్డు సభ్యులు వివిధ పార్టీల నాయకులు మాట్లాడుతూ, ఓ రైతులు పొలం పనులు చేస్తుండగా, అడ్డుకొని ఆయనపై దౌర్జన్యం చేసి దాడి చేసి అడ్డువచ్చిన గ్రామ పెద్దలైన ఆశిరెడ్డి ,లక్ష్మయ్య గోపాల్ మెగావత్ల, పై పోలీస్ స్టేషన్,లోఅక్రమ కేసులు బనాయించడానికి ప్రయత్నాలు చేస్తున్నారని వారుఆరోపించారు . గ్రామ పంచాయతీ చెత్తా వాహనాలను, తమ ఇంటి వద్ద ఉంచుకొని, వాటర్ ట్యాంకర్లు సైతం తమ కుటుంబీకులకు వారి అనుచరులకే, మాముళ్లు ఇచ్చిన వాళ్లకే అందుబాటులో ఉంచుతున్నారని, పారిశుద్ధ్యం పనులు సైతం చేయడం లేదని, గ్రామసభ

నిర్వహించకుండా సంతకాల స్వీకరించి వెళ్లిపోతున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చౌహన్ నర్సింలు, వార్డు సభ్యులు, అంజయ్య, గోపాల్, గ్రామ నాయకులు,సర్దార్, ఆశిరెడ్డి లక్ష్మయ్య, జగదీష్, లక్ష్మయ్య, ప్రతాప్, పాండు, రవికుమార్, బిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

శంషాబాద్,అక్టోబర్30(జనంసాక్షి)రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. ప్రమోద్ కుమార్ సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ఆర్జీఐఏ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు తీసుకున్నారు.శుక్రవారం మొత్తం 10 కేసులను పరిష్కరించి రూ. 22,700 జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన కేసుల్లో అబ్దుల్ ఫయాజ్‌కు రెండు రోజులు, కే. ఆంజనేయులుకు ఒక రోజు సాధారణ జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ రాజేంద్రనగర్ 10వ స్పెషల్ కోర్టు న్యాయమూర్తి కే. వేణుగోపాల్ రెడ్డి తీర్పునిచ్చారు. మరో ఐదుగురికి డ్రంక్ అండ్ డ్రైవ్ కింద రూ. 12 వేల జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన మూడు కేసుల్లో రూ. 4,500 జరిమానా

విధించారు.

ఇచ్చిన హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే శంకర్

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారు కుటుంబం

కేశంపేట, అక్టోబర్ 30 (జనం సాక్షి) : షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఓ నిరుపేద మహిళలకు ఇచ్చిన హామీని 24 గంటల లోపే నెరవేర్చి మానవత్వం చాటుకున్నారు. మండల పరిధిలోని దత్తాయ పల్లి గ్రామంలో గురువారం రెవిన్యూ అధికారులు భూ రీ – సర్వే పై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే శంకర్ హాజరయ్యారు. కార్యక్రమం ముగిసిన అనంతరం ఎమ్మెల్యే గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదే గ్రామానికి చెందిన పోతర్ల ఉమ తనకు రేషన్ కార్డు లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చింది. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సదరు మహిళకు వెంటనే రేషన్ కార్డును మంజూరు చేయాలని తహశీల్దార్ రాజేందర్ రెడ్డిని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు శుక్రవారం ఉమకు రెవిన్యూ అధికారులు రేషన్ కార్డును మంజూరు చేసి అందజేశారు. అడిగిన వెంటనే హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే కు లబ్ధిదారు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద ప్రజలకు ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నెరవేరుస్తూ ముందుకు సాగుతుండడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే పనితీరును విమర్శకులు సైతం ప్రశంసిస్తున్నారు.

అనుమతి లేని కట్టడాలకు కేరాఫ్ అడ్రస్ నాచారం మల్లాపూర్ హెచ్ఎంటి నగర్ డివిజన్‌లే

ఉన్నోడికి న్యాయం లేని వాడికి అన్యాయం

జనం సాక్షి/నాచారం.. అనుమతి లేని అక్రమ కట్టడాలకు అండగా నిలిచి అక్రమార్కులను ప్రోత్సహించిన టౌన్ ప్లానింగ్ అధికారుల తీరు నాచారం హెచ్ఎంటి నగర్ మల్లాపూర్ డివిజన్లో కళ్ళకు కట్టొచ్చినట్టుగా కనబడుతున్నది. ప్రభుత్వము ఒకపక్క అధికారుల తీరు మార్చుకోవాలని నిబద్ధతతో పనిచేయాలని పలుమార్లు సూచనలు తెలియపరిచిన ఉప్పల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లో అధికారుల తీరు మాత్రం అస్తవ్యస్తంగా తయారయింది. వాటిలో మరి ముఖ్యంగా కాప్రా పరిధిలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ అశోక్ నగర్ మల్లాపూర్ మీర్పేట్ నాచారం హెచ్ఎంటి హబ్సిగూడ ప్రధాన డివిజన్లో కాలనీలలో టౌన్ ప్లానింగ్ అధికారుల చేతివాటానికి నిదర్శనం అక్రమ కట్టడాల జోరు విపరీతంగా పెరిగిపోయింది. మల్లాపూర్ డివిజన్లోని పారిశ్రామిక వాడలో గల ప్రధాన రహదారికి ఆనుకొని అనుమతి లేకుండా అక్రమంగా షెడ్ల నిర్మాణం జరుగుతుంది వాటి విషయంలో స్థానికులు కాలనీవాసులు రోడ్డు కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పలుమార్లు టౌన్ ప్లానింగ్ అధికారులకు టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులకు ఏసీబీకి ఫిర్యాదు చేసిన కూడా కనీసం పట్టించుకున్న దాఖలాలు లేవని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. మల్లాపూర్ మాణిక్చంద్ రోడ్డు నుండి మొదలుకొని నాచారం వైపు ప్రయాణిస్తున్నటువంటి మార్గంలో రోడ్డుకు ఇరువైపులా అనుమతి లేకుండా భారీ షెడ్ల నిర్మాణం జరుగుతున్నది. వాటితోపాటు ఎలాంటి అనుమతులు లేకుండా అటు పరిశ్రమలకు సంబంధించి ఐలాధికారుల అనుమతి లేకుండా మరియు జిహెచ్ఎంసి కి సంబంధించి టౌన్ ప్లానింగ్ అధికారుల అనుమతి లేకుండా విచ్చలవిడిగా కట్టడాలు చేపడుతున్న ఎవరికి వారే యమునా తీరే అన్నట్టుగా అధికారులు దోచుకు తింటున్నారే తప్ప ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టకుండా తమ విధులను మరిచిపోయి అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారు. షెడ్ల నిర్మాణం భారీ బహుళ అంతస్తుల నిర్మాణాలకు సంబంధించినటువంటి విషయంలో అక్రమార్కుల తో చేతులు కలిపి అన్ని తామే చూసుకుంటామని అ ఒతస్తుకు ఒక ధరను నిర్ణ యించి వారి దగ్గర నుంచి లక్షల్లో కాజేసి ప్రభుత్వ అధికారులే అక్రమార్కులు గా దర్శనమివ్వటం దురదృ ష్టకరమని సామాజిక కార్య కర్తలు సైతం మండిపడు తున్నారు. మల్లాపూర్ డివిజన్లోని గోకుల్ నగర్ భవానీ నగర్ మీర్పేట్ అన్నపూర్ణ కాలనీ సూర్య నగర్ ఓల్డ్ మల్లాపూర్ విలేజ్ పలను కాలనీలలో సుమారు 60 నుంచి 100 వరకు కూడా అన్ని అనుమతి లేకుండా అక్రమ కట్టడాలు వెలిశాయి అలాంటి వాటి విషయములో చర్యలు తీసుకోవాలని కాలనీలోని కాలనీ సంక్షేమ సంఘానికి సంబంధించినటువంటి సభ్యులు గానీ సామాజిక కార్యకర్తలు గాని టౌన్ ప్లానింగ్ అధికారులకు ఏసీపీకి ఫిర్యాదు చేసిన ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన కనీసం చలనం లేదు అధికారుల్లో అని వారు ఆపోతున్నారు. పరిశ్రమలకు సంబంధించి ఐలా చైర్మన్కు కమిషనర్ కు ఫిర్యాదు చేసిన పారిశ్రామిక వాడలో కూడా ఎలాంటి అనుమతులు పొందకుండా అధికారులకే ముడుపులు చెల్లించి ఇష్టానుసారంగా కట్టడాలు నిర్మిస్తున్నారు. అనుమతి లేని కట్టడాలకు కేరాఫ్ అడ్రస్ గా టౌన్ ప్లానింగ్ అధికారులే నిలుస్తారు లేక అనుమతి లేని కట్టడాలను సహించేది లేదని చర్యలు తీసుకుంటారో ఇక వేచి చూడాల్సిందే.

బియ్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

26 కిలోల ప్యాకింగ్ విధానంపై అధికారుల ఆరా.. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

అల్వాల్, అక్టోబరు 30 (జనంసాక్షి):బియ్యం ధరల పెరుగుదల, విక్రయాల్లో అక్రమాలపై వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో పౌర సరఫరాల శాఖ అధికారులు అల్వాల్ పరిధిలోని బియ్యం దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సహాయ పౌర సరఫరాల అధికారి సంధ్య స్థానిక సిబ్బందితో కలిసి హోల్‌సేల్, రిటైల్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని బియ్యం నిల్వలు, స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలు, విక్రయ బిల్లులను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ తూకపు యంత్రాలపై బియ్యం బస్తాలను తూకం వేసి బరువులను సరిచూశారు. మార్కెట్ నుంచి బియ్యం కొనుగోలు చేసి స్థానికంగా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించామని అధికారులు తెలిపారు. 26 కిలోల ప్యాకింగ్‌పై పరిశీలన 25 కిలోల వరకు ప్రీ-ప్యాకేజ్డ్ బియ్యంపై 5 శాతం జీఎస్టీ వర్తిస్తుండగా, అంతకుమించిన ప్యాకేజీలకు నిబంధనల ప్రకారం పన్ను మినహాయింపు ఉంటుందని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో 26

కిలోల ప్యాకింగ్ విధానాన్ని కొందరు వ్యాపారులు వినియోగించుకుంటున్న తీరుపై పరిశీలిస్తున్నట్లు తెలిపారు. పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని వినియోగదారులకు అందించకుండా అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ నిల్వలు చేస్తే చర్యలు బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేయడం, కృత్రిమ కొరత సృష్టించడం, అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌తోపాటు అవసరమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతులు కలిగి ఉండాలని సూచించారు. బిల్లు తీసుకోవాలి బియ్యం ధరలు పెరుగుతాయనే ఆందోళనతో ప్రజలు అవసరానికి మించి కొనుగోళ్లు చేయవద్దని అధికారులు సూచించారు. ప్రతి కొనుగోలుకూ తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలని కోరారు. తూకంలో తేడాలు ఉంటే లీగల్ మెట్రాలజీ శాఖకు, నాణ్యత లోపాలు లేదా అధిక ధరలకు విక్రయిస్తే పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు, విక్రయాలపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు.

బర్వాద్, జిన్నారం గ్రామాల్లో రేషన్ కార్డుల పంపిణీ

కోట్‌పల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి): కోట్‌పల్లి మండలంలోని బర్వాద్, జిన్నారం గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ప్రజాప్రతినిధులు, అధికారులు రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ ఆనందరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రామావత్ అనితా రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తేనె రాంచందర్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల సర్పంచులు పాల్గొని కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బర్వాద్‌లో కూలిన ఇంటిని పరిశీలించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు

కోట్‌పల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి): కోట్‌పల్లి మండలం బర్వాద్ గ్రామంలో కూలిపోయిన ఇంటిని సర్పంచ్ ప్రతిభ రమేష్, తహసీల్దార్ ఆనందరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రామావత్ అనితా రమేష్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తేనే రామచంద్రారెడ్డి శుక్రవారం పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతూ, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

శాంతినగర్‌లో పలు సమస్యలపై అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

రాజేంద్రనగర్,అక్టోబర్30(జనంసాక్షి)నార్సింగి సర్కిల్ 45 పరిధిలో నిర్వహించిన వన్ డే--వన్ వార్డ్ కార్యక్రమంలో భాగంగా కోకాపేట్ శాంతినగర్‌లో డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు కాలుష్యం, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, నిర్మాణాల వల్ల దుమ్ము సమస్యలతో పాటు పాఠశాలలో అండర్‌గ్రౌండ్ సంప్ ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యలను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని లక్ష్మారెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ విజయ్ బాబు, డీఈ ఎల్. అన్వేష్ రెడ్డి, ఏఈఈ సంతోష్, వార్డు అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కేశ్వపూర్‌లో మట్టి తవ్వకాలను పరశీలించిన అధికారులు

శామీర్ పేట్, అక్టోబర్ 30(జనంసాక్షి)కేశ్వపూర్ లో మట్టి తవ్వకాలను మూడు చింతల పల్లి ఎమ్మార్వో గులాం ఇద్రిస్ ఆధ్వర్యంలో రెవిన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు మట్టి తవ్వ కాలను పరశీలించి మట్టి మాఫియా తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. కేశ్వపూర్ కౌన్సిలర్ గోవర్ధన్ ప్రజావాణిలో ఫిర్యాదు మేరకు మట్టి తవ్వ కాలను పంచనామా చేసినట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో రెవిన్యూ, మైనింగ్, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలివెళ్లిన యువజన కాంగ్రెస్ శ్రేణులు

తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో

మొయినాబాద్,అక్టోబర్30, జనంసాక్షి:ఓట్ చోరీకి వ్యతిరేకంగా నవంబర్ 1వ తేదీన ఢిల్లీలోని రాష్ట్రీలా మైదానంలో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న భారీ ర్యాలీకి తెలంగాణ యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కిడి శివ చరణ్ రెడ్డి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక బస్సుల్లో ఢిల్లీకి తరలివెళ్లారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పోరాటం కొనసాగుతుందని, జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంతవరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం యువజన కాంగ్రెస్ శ్రేణులు నిరంతరం పోరాడుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగేందర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి షాద్నగర్ అసెంబ్లీ ఇన్చార్జి దయానంద్ గౌడ్, చేవెళ్ల మండల అధ్యక్షులు మల్లారి కార్తీక్ రెడ్డి, పాల్గొన్నారు.

ఆలస్యంగా వచ్చినందుకు విద్యార్థిపై కర్రతో దాడి చేసిన కళాశాల చైర్మన్?

వైస్ ప్రిన్సిపాల్ కూడా గతంలో పైపుతో కొట్టినట్లు తల్లి ఫిర్యాదు

అమీర్‌పేట్ / బోరబండ , అక్టోబర్ 30 (జనం సాక్షి): కళాశాలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చాడనే కారణంతో విద్యార్థిపై కళాశాల చైర్మన్ కర్రతో దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. మంగళారపు రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ఆమె చిన్న కుమారుడు అరుణ్ వెంకట్రావు నగర్‌లోని అమృత జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 27న ఐదు నిమిషాలు ఆలస్యంగా కళాశాలకు వెళ్లడంతో చైర్మన్ మహేందర్ రెడ్డి తన కుమారుడి చేతులపై కర్రతో కొట్టినట్లు తల్లి ఫిర్యాదులో పేర్కొంది.అంతేకాకుండా, సుమారు నెల రోజుల క్రితం కళాశాల వైస్ ప్రిన్సిపాల్ స్వామి రెడ్డి సైతం తన కుమారుడిని ప్లాస్టిక్ పైపుతో కొట్టినట్లు ఆరోపించింది. విద్యార్థిపై దాడికి పాల్పడిన సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

పిజెఆర్ స్టేడియంలో ఈవినింగ్ వాకర్స్ తో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం

శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) : లింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్ పరిధి పిజెఆర్ స్టేడియంలో ఈవినింగ్ వాకర్స్ తో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రధానంగా వయోవృద్ధులతో సహా సుమారు 60 మంది పాల్గొన్నారు. శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్, ఐఎఎస్ అధికారి అమిత్ నారాయణ్ ముఖ్య అతిథిగా హాజరై డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు, ఓటిపి మోసాలు, గుర్తుతెలియని మొబైల్ యాప్‌లు, మోసపూరిత వీడియో కాల్స్ మరియు ఇతర ఆన్‌లైన్ మోసాలతోసహా వివిధ సైబర్ మోసాలపై విలువైన సలహాలు అందించారు. అలాగే, తమను తాము రక్షించుకోవడానికి తీసుకోవలసిన ముందుజాగ్రత్త చర్యలను కూడా ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మియాపూర్ సి.ఎం.సి డివిజన్ మరియు పోలీస్ చందానగర్ పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ కుమార్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సైబరాబాద్ ట్రాఫిక్ సమస్యలను తెరదించేందుకు 'సైబరాబాద్ మూవ్స్--2026' పోస్టర్ ఆవిష్కరణ

శేరిలింగంపల్లి, అక్టోబర్ 30 (జనంసాక్షి) : సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, ట్రాఫిక్ విభాగం జాయింట్ పోలీస్ కమిషనర్ సంయుక్తంగా సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో 'సైబరాబాద్ మూవ్స్--2026' అనే పోస్టర్‌ను ఆవిష్కరించడం జరిగింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, సైబరాబాద్ పోలీస్, సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మూడు రోజుల కార్యక్రమాన్ని నవంబర్ 26 నుంచి 28, 2026 వరకు నిర్వహించనున్నట్లు అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశంలో భాగంగా సైబరాబాద్ ప్రాంతంలో పట్టణ రవాణా సవాళ్లను పరిష్కరించడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం అని వక్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు, సిఎంసి అధికారులు, పోలీస్ మరియు ట్రాఫిక్ విభాగాల అధికారులు, సీనియర్ ప్రభుత్వ అధికారులు, పౌర సమాజ ప్రతినిధులు, పారిశ్రామిక రంగ ప్రతినిధులు పాల్గొనడం గమనార్హం. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమంలో ఎగ్జిబిషన్లు, నాలెడ్జ్ సెషన్లు, పరస్పర చర్చలు, మొబిలిటీ ఇన్నోవేషన్ ఛాలెంజ్ ను నిర్వహించనున్నారు. ప్రభుత్వ విభాగాలు, పౌరులు, కార్పొరేట్ సంస్థలు, విద్యార్థులు, పట్టణ ప్రణాళిక నిపుణులు, రవాణా రంగ నిపుణులు ఒకే వేదికపైకి వచ్చి పట్టణ రవాణా సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను చర్చించేందుకు ఈ కార్యక్రమం గొప్ప అవకాశాన్ని కల్పించనుంది. సమిష్టి కార్యాచరణకు దిశానిర్దేశం చేసే సైబరాబాద్ మూవ్స్ డిక్లరేషన్ కూడా ఈ కార్యక్రమంలో ప్రతిపాదించబడిందని ఫైబర్ సిపి డాక్టర్ ఎం రమేష్ మీడియాకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా సురక్షిత జంక్షన్లు, పాదచారులకు అనుకూలమైన రహదారులు, ప్రజా రవాణా అనుసంధానం, కార్పొరేట్ ఉద్యోగుల రాకపోకల విధానాలు, సుస్థిర పట్టణ రవాణా అంశాలపై దృష్టిని సారించనున్నట్లు తెలుస్తోంది. సిఎంసి ఆధ్వర్యంలో ప్రస్తుతం ఆరు ప్రధాన జంక్షన్ల అభివృద్ధి పనులు కొనసాగుతుండగా, ట్రాఫిక్ పోలీస్ విభాగం, నిపుణుల సహకారంతో మొత్తం 74 కీలక జంక్షన్లను అభివృద్ధి చేసే విస్తృత ప్రణాళికలో భాగంగా చర్యలు చేపడుతున్నారు. రహదారి భద్రత, సురక్షిత వీధుల రూపకల్పనపై సిఎంసి ఇంజినీర్లు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నారు. వాక్-ఫ్రీ ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు కార్యక్రమం, కార్పొరేట్ కమ్యూట్ కార్యక్రమాలు, విద్యార్థుల మొబిలిటీ కార్యక్రమాలు, కాంట్రా ఫ్లో బస్ లేన్లు, వన్-వే ట్రాఫిక్ సాధ్యాసాధ్యాల అధ్యయనాలను కూడా ఈ వేదికపై ప్రదర్శించనున్నారు. ఎగ్జిబిషన్లు, భారీ మ్యాపులు, డేటా విజువలైజేషన్లు, నాలెడ్జ్ సెషన్ల ద్వారా సైబరాబాద్‌లో ప్రస్తుత రవాణా పరిస్థితులు, ఎదురవుతున్న సమస్యలు, భవిష్యత్తు అవసరాలపై అవగాహన కల్పించడంతో పాటు సురక్షితమైన, అందరికీ అందుబాటులో ఉండే, పాదచారులకు అనుకూలమైన మరియు సుస్థిర సైబరాబాద్ నిర్మాణానికి సమిష్టి భాగస్వామ్యాన్ని ఇందులో భాగంగా ప్రోత్సహించనున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

స్పీడ్ బ్రేకర్లు ప్రమాదం చోటు గుర్తించి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి

జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 30 (జనం సాక్షి):జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులను ఆదేశించారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు నిర్వహించిన రోడ్డు భద్రతా సమీక్ష సమావేశంలో జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు, ప్రమాదాలకు కారణాలు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి తక్షణమే అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. రోడ్లపై గుంతల మరమ్మతులు, రోడ్డు సూచిక బోర్డులు, వీధి దీపాలు, స్పీడ్ బ్రేకర్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను పటిష్టంగా అమలు చేయాలని ఆదేశించారు.జిల్లా ఎస్పీ స్నేహ మెహర మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, హెల్మెట్ మరియు సీటు బెల్ట్ ధరించకపోవడం వంటి కారణాలతో ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు.పాఠశాలలు, కళాశాలల్లో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించాలని అధికారులకు సూచించారు.అనంతరం మత్తు పదార్థాల పై సమీక్షించారు. మత్తు పదార్థాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని,మత్తు పదార్థాల వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థకు, సమాజానికి తీవ్ర నష్టం కలిగిస్తుందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. మత్తు పదార్థాల వినియోగం, అక్రమ రవాణా మరియు విక్రయాలను అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.రోడ్డు భద్రతా సమావేశంలో భాగంగా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. పాఠశాలలు, కళాశాలల్లో మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు.పోలీస్ అధ్వర్యంలోరోడ్డు ప్రమాదాలపై ఏర్పాటు చేసిన వీడియో ను పి పి టి ద్వార వివరించారు. ఈ సమావేశంలో ట్రైని కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుటూర్, అడిషనల్ ఎస్ పి రాజేష్ మీనా , ఆర్ అండ్ బి ఇ ఇ శ్రీధర్ రెడ్డి, ఇ ఇ పి ఆర్ ఉమేష్ కుమార్,డి పి ఓ జయ సుధ, వైద్య అధికారి చంద్ర శేఖర్,డి ఎ స్ పి లు , సి ఐ లు, డ్రగ్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, మున్సిపల్ కమిషనర్ లు,సంబంధిత శాఖల అధికారులు, పోలీస్ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా.. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా.. ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

తాండూరు అక్టోబర్ 30(జనంసాక్షి)తాండూరు నియోజకవర్గంలో ని బషీరాబాద్ మండలం రెడ్డిఘనపూర్ గ్రామంలో రూ.68.60 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి శంకుస్థాపనలు మరియు ప్రారంభోత్సవాలు చేశారు.గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల వివరాలు..రూ.10 లక్షలతో ఎస్సీ వాడలో సైడ్ డ్రైన్ మరియు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన.రూ.6 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభం.రూ.10 లక్షలతో మహిళ సంఘం భవన నిర్మాణానికి శంకుస్థాపన.రూ.13.60 లక్షలతో ఎంపిపిఎస్, జడ్పిహెచ్ ఎస్ పాఠశాలలకు కంపౌండ్ వాల్ నిర్మాణానికి శంకుస్థాపన.రూ.9 లక్షలతో రైతులకు మట్టి (ఫార్మేషన్) రోడ్డుకు శంకుస్థాపన.రూ.20 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే బీఎంఆర్ ప్రారంభించారు.కుర్వ విజయలక్ష్మీ రాములు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహరన్న.అనంతరం 444 స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగాప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ప్రతి గ్రామానికి అభివృద్ధి ఫలాలు అందిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల అధికారులు, సర్పంచ్ లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూగర్భ కార్బన్ నిల్వపై సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ విస్తృత శిక్షణా కార్యక్రమం

అనువైన భూగర్భ నిర్మాణాలను గుర్తించడం ద్వారా సురక్షితమైన కార్బన్ నిల్వకు అవకాశం: డాక్టర్ ప్రకాష్ కుమార్

హబ్సిగూడ/ఉప్పల్, అక్టోబర్ 30 (జనం సాక్షి):వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం, పర్యావరణ పరిరక్షణకు శాస్త్రీయ పరిష్కారాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎస్ఐఆర్-జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ (ఎన్జీఆర్ఐ) కీలకమైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. సీఎస్ఐఆర్ సమగ్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా అక్టోబర్ 26 నుంచి 30 వరకు భూగర్భ కార్బన్ నిల్వ ప్రదేశాల భౌగోళిక లక్షణాల నిర్ధారణపై ఐదు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని చేపట్టింది. కార్బన్ సంగ్రహణ, నిల్వ సాంకేతికతలకు సంబంధించిన పరిజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు ఈ రంగంలో పనిచేస్తున్న నిపుణులకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.కార్బన్ నిల్వకు అనువైన ప్రాంతాల గుర్తింపుపై శిక్షణపారిశ్రామిక కార్యకలాపాలు, ఇంధన వినియోగం తదితర కారణాలతో వెలువడే కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలను తగ్గించడం ప్రపంచవ్యాప్తంగా కీలకమైన అంశంగా మారింది. ఈ నేపథ్యంలో కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించి, తగిన భౌగోళిక పరిస్థితులు ఉన్న ప్రాంతాల్లో సురక్షితంగా భూగర్భంలో నిల్వ చేసే సాంకేతికతకు ప్రాధాన్యం పెరుగుతోంది. అయితే ఈ ప్రక్రియ విజయవంతం కావాలంటే భూగర్భ నిర్మాణాల స్వభావం, వాటి లక్షణాలు, నిల్వకు అనుకూలత వంటి అంశాలను శాస్త్రీయంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. ఈ అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.భూగర్భంలో కార్బన్ నిల్వ చేయడానికి అనువైన ప్రాంతాలను గుర్తించడం, వాటి భౌగోళిక లక్షణాలను అర్థం చేసుకోవడం, కార్బన్ డయాక్సైడ్‌ను దీర్ఘకాలికంగా సురక్షితంగా నిల్వ చేసేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించడం ఈ శిక్షణలో ప్రధాన అంశాలుగా ఉన్నాయి. పరిశోధనా రంగంలో అందుబాటులో ఉన్న శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పరిశ్రమల అవసరాలకు అనుసంధానించడం ద్వారా దేశంలో కార్బన్ సంగ్రహణ, నిల్వ సాంకేతికతల అభివృద్ధికి దోహదపడాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. 14 మంది నిపుణులు, పరిశోధకులు, విద్యార్థుల భాగస్వామ్యంఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ పరిశ్రమలకు చెందిన ఆరుగురు నిపుణులు, ఒక స్వతంత్ర సలహాదారు, ముగ్గురు పీహెచ్‌డీ పరిశోధకులు, నలుగురు మాస్టర్స్ విద్యార్థులు కలిపి మొత్తం 14 మంది పాల్గొన్నారు. వీరిలో నలుగురు మహిళలు, పది మంది పురుషులు ఉన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు.ఎన్‌పీసీఐఎల్, ఆయిల్ ఇండియా లిమిటెడ్, కల్ప్రా టెక్ సొల్యూషన్స్, డ్రేక్ ఏఐ, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఐఐటీ (ఐఎస్ఎం) ధన్‌బాద్, ఎన్ఐటీ కర్ణాటక, ఉస్మానియా విశ్వవిద్యాలయం తదితర సంస్థలు, విద్యాసంస్థలకు చెందిన వారు ఈ శిక్షణలో పాల్గొన్నారు. పరిశ్రమల అనుభవం, విద్యాసంస్థల పరిశోధనా పరిజ్ఞానం ఒకే వేదికపైకి రావడం ద్వారా భూగర్భ కార్బన్ నిల్వ రంగానికి సంబంధించిన సాంకేతిక అంశాలపై అవగాహన పెంపొందించుకునే అవకాశం కలుగుతోంది .నైపుణ్యాభివృద్ధికి సీఎస్ఐఆర్ ప్రాధాన్యంశిక్షణా కార్యక్రమం ప్రారంభోత్సవంలో భాగంగా సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ సీనియర్ సాంకేతిక అధికారి-1, కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ ఉమా వడపల్లి కార్యక్రమాన్ని ప్రారంభించి, పాల్గొన్నవారిని పరిచయం చేశారు. శిక్షణా కార్యక్రమం నిర్వహణ, దాని లక్ష్యాలకు సంబంధించిన వివరాలను తెలియజేశారు.సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్త-జి, సీఎస్ఐఆర్ సమగ్ర నైపుణ్యాభివృద్ధి కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ అభయ్ రామ్ బన్సల్ మాట్లాడుతూ, పరిశ్రమలు, పరిశోధనా రంగాల్లో మారుతున్న అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. శాస్త్రీయ పరిజ్ఞానాన్ని ఆచరణాత్మక నైపుణ్యాలుగా అభివృద్ధి చేసేందుకు ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు.సీఎస్ఐఆర్-ఎన్జీఆర్ఐ శాస్త్రవేత్త-జి, మానవ వనరుల అభివృద్ధి విభాగాధిపతి డాక్టర్ ఈ.వి.ఎస్.ఎస్.కె. బాబు సంస్థలో కొనసాగుతున్న మానవ వనరుల అభివృద్ధి కార్యకలాపాల గురించి వివరించారు. ఈ ప్రక్రియలో శాస్త్రీయ పరిశోధనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, నిపుణుల అనుభవం కీలక పాత్ర పోషిస్తాయని స్పష్టం చేశారు. భూగర్భ కార్బన్ నిల్వకు సంబంధించి సరైన ప్రాంతాలను గుర్తించడం, వాటి లక్షణాలను విశ్లేషించడం, నిల్వ ప్రక్రియ సురక్షితంగా ఉండేలా శాస్త్రీయ అవగాహనను పెంపొందించడం అత్యంత ముఖ్యమని ఆయన వివరించారు. ఈ రంగంలో నైపుణ్యం కలిగిన మానవ వనరులను అభివృద్ధి చేయడం ద్వారా కార్బన్ సంగ్రహణ, నిల్వ సాంకేతికతలపై దేశ సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవచ్చని తెలిపారు.కార్బన్ సంగ్రహణ, నిల్వ సాంకేతికతల అభివృద్ధే లక్ష్యంకార్యక్రమ సమన్వయకర్త, శాస్త్రవేత్త-జి డాక్టర్ నిమిషా వేదాంతి శిక్షణా కార్యక్రమ లక్ష్యాలు, పరిధిని వివరించారు. భూగర్భ కార్బన్ నిల్వకు సంబంధించిన భౌగోళిక లక్షణాలపై పాల్గొనేవారికి సాంకేతిక అవగాహన కల్పించడం, ఈ రంగంలో వారి పరిజ్ఞానాన్ని మెరుగుపరచడం కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని వివరించారు. అనంతరం వందన సమర్పణ చేశారు.

తలకొండపల్లిలో పొజిషన్ లేని భూమికి అక్రమ రిజిస్ట్రేషన్ కలకలం



రిజిస్ట్రేషన్ నిలిపివేసి న్యాయం చేయాలని తహసీల్దార్ రమేష్ కు వినతి

తలకొండపల్లి అక్టోబర్ 30 (జనంసాక్షి):రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండల కేంద్రంలో భూ అక్రమాలు రోజురోజుకు మితిమీరుతున్నాయని రైతులు ఆరోపిస్తున్నారు.మండల కేంద్రం శివారు సర్వే నెంబర్ 17 లో గల భూమిని 20 ఏండ్ల క్రితం కందే కృష్ణయ్య వద్ద నుంచి అంబటి జంగయ్య అనే రైతు కొనుగోలు చేసి,అప్పటి నుంచి పొజిషన్ లో ఉంటూ సాగు చేసుకుంటున్నాడు.అయితే,పొజిషన్ లో లేని కొందరు వ్యక్తులు,తలకొండపల్లికి చెందిన బడా నేత అనుచరుల అండదండలతో,అంబటి జంగయ్య సాగు చేసుకుంటున్న సొంత భూమికి చెందిన హద్దులు పెట్టి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.కబ్జాలో లేని భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని నా సొంత భూమి లోకి రావడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు.తన పట్టా పొలాన్ని అక్రమంగా లాక్కోవడానికి ప్రయత్నిస్తూ,గత నెల రోజులుగా తనను,తన కుటుంబ సభ్యులను మానసికంగా వేధిస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని బాధితుడు వాపోయాడు.దీంతో బాధిత రైతుకు మద్దతుగా కాంగ్రెస్,బీజేపీ పార్టీల నాయకులు,గ్రామస్తులు కలిసి తలకొండపల్లి తహసీల్దార్ కే.రమేష్,కి వినతిపత్రం అందజేశారు.ఇలాంటి అక్రమ రిజిస్ట్రేషన్లను వెంటనే నిలుపుదల చేసి,20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న రైతుకు న్యాయం చేయాలని,తలకొండపల్లిలో ఇలాంటి భూ అక్రమాలు పునరావృతం కాకుండా అధికారులు,ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

చిలకమర్రం దేవాదాయ భూములకు ముప్పు!

ఆక్రమణలు, నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు జేఏసీ వినతి

అల్వాల్, అక్టోబరు 30 (జనంసాక్షి): అల్వాల్‌లోని పురాతన రామాలయానికి చెందిన చిలకమర్రం ప్రభుత్వ దేవాదాయ భూముల్లో ప్రైవేటు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడి నిర్మాణాలు చేపడుతున్నారని స్థానిక జేఏసీ నాయకులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆలయ భూములను పరిరక్షించడంతోపాటు, ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు స్థానిక జేఏసీ నాయకుడు పటోళ్ల సురేందర్‌రెడ్డి శుక్రవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ విజేందర్‌రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించారు. చిలకమర్రం దేవాదాయ భూములపై సమగ్ర విచారణ జరిపి, ఆక్రమణలను అడ్డుకోవాలని, అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. ఆలయానికి చెందిన ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పరిరక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షురాలిగా దానగళ్ళ సరిత

కేశంపేట, అక్టోబర్ 30 (జనం సాక్షి): భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షులుగా మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన దానగళ్ళ సరిత నియమితులయ్యారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షులు వి. నరసింహా చేతుల మీదుగా సరిత నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు పాలాది శ్రీనివాస్ గుప్తా, మండల బీజేపీ నాయకులు , కార్యకర్తలు సరితకు శుభాకాంక్షలు తెలియజేశారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ మండలంలో ఎస్సీ మోర్చా బలోపేతానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

తొండుపల్లి చెరువులోకి మురుగునీరు

కాలుష్యంపై డీసీకి వినతి

శంషాబాద్,అక్టోబర్30(జనంసాక్షి)శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని తొండుపల్లి చెరువులోకి చేరుతున్న మురుగునీటిని అరికట్టేందుకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఓబిసి మోర్చా కార్యదర్శి బైతి శ్రీధర్ స్థానికులతో కలిసి శంషాబాద్ డీసీ సుమన్ రావుకు వినతిపత్రం అందజేశారు. మురుగునీటితో చెరువు కలుషితమై దుర్వాసన, దోమల బెడద పెరగడంతో పాటు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మురుగునీరు చెరువులోకి చేరుతున్న మార్గాలను గుర్తించి అడ్డుకోవడంతో పాటు డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు, నీటి నాణ్యత పరీక్షలు చేపట్టి చెరువును పరిరక్షించాలని అధికారులను కోరారు.

అర్హులైన పట్టభద్రులంతా కొత్తగా ఓటరు నమోదు చేసుకోవాలి

మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి

తాండూరు అక్టోబర్ 30(జనంసాక్షి) : హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పట్టణంలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. శ్రీ నేతాజీ గురుదేవ్ గురుకుల్ స్కూల్, గంగోత్రి విద్యాలయ హైస్కూల్, సెయింట్ మార్క్స్ హైస్కూల్, సెయింట్ మార్క్స్ జూబ్లీ స్కూల్, సెయింట్ మేరీస్ హైస్కూల్, అక్షర హై స్కూల్ ఉపాధ్యాయులను కలిసి గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపిన రోహిత్ రెడ్డి.. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. సాధారణ ఎన్నికల ఓటరు జాబితాకు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు జాబితాకు తేడా ఉంటుందని వివరించారు. గతంలో ఓటరుగా నమోదు చేసుకున్న వారు కూడా ఈసారి కొత్తగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదు చేసుకునేందుకు నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఆలస్యం చేయకుండా వెంటనే దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ సభ్యుల్లో అర్హులైన పట్టభద్రులు ఉంటే వారిని కూడా ఓటర్లుగా నమోదు చేయించే బాధ్యత తీసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులకు ఇబ్బంది కలగకుండా తాము స్వయంగా పాఠశాలల వద్దకే వచ్చి నమోదు ప్రక్రియ పూర్తి చేసేలా సహకరిస్తామని తెలిపారు. దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు, డిగ్రీ సర్టిఫికెట్, ఓటర్ ఐడీ కార్డు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ శ్రీశైల్ రెడ్డి, తాండూర్ పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ నరుకుల నరేందర్ గౌడ్, సీనియర్ నాయకులు పట్లోళ్ల నర్సింహులు, శ్రీనివాస్ చారి, మహిళా నాయకురాలు పరిమళతో పాటు బిఆర్ఎస్ నాయకులు దత్తు, సందీప్, వినోద్, ఇమ్ము, నర్సింహ్ పాల్గొన్నారు.

జీడిమెట్ల, బాలానగర్‌లో రసాయన వాసనలపై టీజీపీసీబీ సమీక్ష

స్క్రబ్బర్లను నిరంతరాయంగా నిర్వహించాలి.. ప్రతి 15 రోజులకు ఉద్గారాల నివేదికలు సమర్పించాలి

అమీర్‌పేట్ /సనత్నం నగర్ సాక్షి : జీడిమెట్ల, బాలానగర్ పారిశ్రామిక ప్రాంతాల్లోని రసాయన పరిశ్రమల నుంచి వెలువడుతున్న దుర్వాసనలపై స్థానిక ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదుల నేపథ్యంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) హైదరాబాద్ జోనల్ అధికారులు స్పందించారు. ఆయా పరిశ్రమల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి కాలుష్య నియంత్రణ చర్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా నివాస ప్రాంతాల్లోకి వ్యాపిస్తున్న రసాయన వాసనల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిశ్రమల ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. కాలుష్యాన్ని నియంత్రించేందుకు పరిశ్రమల్లో ఏర్పాటు చేసిన స్క్రబ్బర్లను నిరంతరాయంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. వాటి పనితీరుకు సంబంధించిన రికార్డులను క్రమం తప్పకుండా నమోదు చేయాలని సూచించారు. అలాగే ప్రతి 15 రోజులకు ఒకసారి వాయు ఉద్గారాలను పర్యవేక్షించి, సంబంధిత నివేదికలు, రికార్డులను మండలికి సమర్పించాలని స్పష్టం చేశారు. పరిశ్రమల యాజమాన్యాలు స్వీయ పర్యవేక్షణలో భాగంగా క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, దుర్వాసనలకు కారణమవుతున్న మూలాలను గుర్తించి తక్షణ నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కాలుష్య నియంత్రణ నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగించే పరిశ్రమలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ జోనల్ అధికారులు హెచ్చరించారు.

జవహర్ నగర్ బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడిగా పోలాస అశోక్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

- **యువతను ఏకం చేసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: మాజీ మంత్రి మల్లారెడ్డి**

జవహర్ నగర్: సెప్టెంబర్ 30: (జనంసాక్షి) జవహర్ నగర్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా పోలాస అశోక్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికయ్యారు ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు అశోక్ కుమార్‌కు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంలో యువత కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. నూతనంగా ఎన్నికైన అశోక్ కుమార్ యువతను ఏకతాటిపైకి తీసుకువచ్చి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. యూత్ విభాగాన్ని మరింత క్రియాశీలకంగా తీర్చిదిద్దుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జవహర్ నగర్ మాజీ మేయర్ మేకల కావ్య, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ కార్పొరేటర్లు ఆలూరి సంగీత రాజశేఖర్, పల్లపు రవి, బీఆర్ఎస్ నాయకులు సింగన్న బాలరాజ్, సిద్దులు యాదవ్, బండి నవీన్, పోలాస సాయి, కృష్ణ యాదవ్, యాకమ్మ, మల్లమ్మ, విమల తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన పోలాస అశోక్ కుమార్‌ను నాయకులు, కార్యకర్తలు అభినందించారు. తనపై నమ్మకంతో యువజన విభాగం అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన మాజీ మంత్రి మల్లారెడ్డి, పార్టీ నాయకులకు అశోక్ కుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, యువత సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

దేవనూర్ సర్పంచ్ అభ్యర్థనకు డీఈఓ సానుకూలం

ఒకే ఉపాధ్యాయురాలిపై ఆధారపడి చదువుకుంటున్న పరిస్థితి నెలకొంది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను కేటాయించాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఒక గ్రామంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉపాధ్యాయురాలిని కొనసాగించాలని కోరిన అభ్యర్థనకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లే, బషీర్‌మియాతాండ పాఠశాలలోనూ విద్యార్థుల విద్యా ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అక్కడి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అదనపు ఉపాధ్యాయురాలిని నియమిస్తారా? లేక ప్రస్తుత ఉపాధ్యాయురాలితోనే విద్యాబోధన కొనసాగిస్తారా? అనేది వేచి చూడాల్సి ఉంది. ఒక గ్రామ విద్యార్థుల ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇచ్చిన అధికారులు, మరో గ్రామంలోని 40 మంది విద్యార్థుల చదువుపైనా అదే స్థాయిలో స్పందించి ఉపాధ్యాయుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

బ్రేక్‌ఫాస్ట్ ప్రేయర్ మీటింగ్‌లో పాల్గొన్న కొలన్ హన్మంత్ రెడ్డి

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 30(జనం సాక్షి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించిన శుక్రవారం బ్రేక్‌ఫాస్ట్ ప్రేయర్ మీటింగ్ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత మరియు ప్రజలందరి సంక్షేమం కోసం ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలని, ఓటు నమోదు ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని కోరారు. ముఖ్యంగా అర్హులైన పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రభుత్వ సమన్వయకర్త కల్లోజి రవికుమార్, సీఎం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ చైర్మన్ మరియు అధ్యక్షులు రెవరెండ్ డాక్టర్ గోడి శేఖర్, డివిజన్ అధ్యక్షులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, పండరి రావు, వార్డ్ నో. శ్రీనివాస్, కలీం, అజయ్, జమీర్,రమేష్, కాఫర్, పశ, కార్యదర్శి బిషప్ ఎం.ఎస్. సామ్యూల్ పీటర్, కోశాధికారి రెవరెండ్ దయానిధి, ఉపాధ్యక్షులు ఆనంద్ బాబు, సంయుక్త కార్యదర్శి సి. హెచ్. బెల్లాజర్ రాజు, న్యాయ సలహాదారు, నియోజకవర్గ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాస్టర్ జి. రాజశేఖర్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ రివైవల్ పాస్టర్స్ ప్రేయర్ ఫెలోషిప్ ప్రతినిధులు, పాస్టర్లు, క్రైస్తవ మత పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

మణికొండ కమ్యూనిటీ హాల్‌లో ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రత్యేక శిబిరం

షేక్ పేట, (జనంసాక్షి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు సమీపిస్తున్నందున అర్హులైన పట్టభద్రులందరూ వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలని ప్రకటన విడుదల చేశారు. నవంబర్ 6, 2026 ఓటరు నమోదుకు చివరి తేదీ కాగా, పౌరుల సౌకర్యార్థం ప్రత్యేక నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అక్టోబర్ 31, 2026 నుండి నవంబర్ 01, 2026 వరకు (శని, ఆదివారాలు) ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు మణికొండ మర్రిచెట్టు సర్కిల్, జలమండలి ఆఫీస్ పక్కన ఉన్న కమ్యూనిటీ హాల్ నందు ఎమ్మెల్సీ ఓటరు నమోదు సహాయక శిబిరం నిర్వహించబడుతుంది. కావాల్సిన పత్రాలు,పాస్‌పోర్ట్ సైజ్ ఫోటో,ఆధార్ కార్డ్ డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్ లేదా ఫోటో అర్హత కలిగిన పట్టభద్రులు పై పత్రాలతో శిబిరానికి విచ్చేసి ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ యువత రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున్ మరియు నిర్వాహకులు కోరారు.

కేశ్వపూర్‌లో మట్టి తవ్వకాలను పరిశీలించిన అధికారులు

శామీర్ పేట్, అక్టోబర్ 30(జనంసాక్షి) కేశ్వపూర్ లో మట్టి తవ్వకాలను మూడు చింతల పల్లి ఎమ్మార్వో గులాం ఇద్రిస్ ఆధ్వర్యంలో రెవిన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు మట్టి తవ్వ కాలను పరిశీలించి మట్టి మాఫియా తవ్వకాలు జరిపినట్లు గుర్తించారు. కేశ్వపూర్ కౌన్సిలర్ గోవర్ధన్ ప్రజావాణిలో ఫిర్యాదు మేరకు మట్టి తవ్వ కాలను పంచనామా చేసినట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో రెవిన్యూ, మైనింగ్, పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలతో దీర్ఘకాలిక సమస్యకు పరిష్కారం

తాండూరు అక్టోబర్ 30(జనంసాక్షి) : తాండూర్ పట్టణంలో ప్రతి మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ నీరజబాల్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే మార్నింగ్ వాక్‌లో భాగంగా ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పర్యటించారు. గత కొంతకాలంగా పోట్లిమహారాజ్ కాంప్లెక్స్ ముందు, గాంధీనగర్‌లో అంగన్వాడీ ప్రక్కన పేరుకు పోయిన చెత్తాచెదారాన్ని గమనించారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత మున్సిపల్ అధికారులకు ఆ ప్రాంతాన్ని తక్షణమే శుభ్రపరిచి, పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు స్పందించిన మున్సిపల్ సిబ్బంది పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించి, ఆ ప్రాంతాన్ని శుభ్రపరిచారు. చాలాకాలంగా నెలకొన్న సమస్య పరిష్కారం కావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

పందెమువాగు బ్రిడ్జి శిథిలావస్థ.. ప్రమాదం పొంచి ఉంది

వెంటనే మరమ్మతులు చేపట్టాలి: బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

రాజేంద్రనగర్,అక్టోబర్30(జనంసాక్షి) : మణికొండ పుప్పాలగూడ పైప్‌లైన్ రోడ్డులోని పందె ముువాగుపై నిర్మించిన బ్రిడ్జి బీటలు వారడంతో శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సంగం శ్రీకాంత్, భానుచందర్ ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో బ్రిడ్జి పరిస్థితిని అధికారులు పట్టించుకోకపోవడం ఆందోళనకరమన్నారు. గతంలో గోల్డెన్ టెంపుల్ సమీపంలో డ్రైనేజీ పనుల సమయంలో ఇంజనీర్ రజనీకాంత్ ప్రమాదవశాత్తు గల్లంతై మృతిచెందిన ఘటనను గుర్తుచేశారు. అలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా పందెమువాగు బ్రిడ్జికి వెంటనే మరమ్మతులు చేపట్టి, ప్రమాద నివారణ చర్యలు తీసుకోవాలని వారు సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.

జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ ప్రథమ కర్తవ్యం

- చౌడాపూర్‌లో ఘనంగా టీయూడబ్ల్యూజే హెచ్-143 యూనియన్ కార్యాలయ ప్రారంభోత్సవం
- జిల్లా అధ్యక్షుడు కంద్లపల్లి రవీంద్ర

చౌడాపూర్ మండల్ అక్టోబర్ 30 జనం సాక్షి : వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే హెచ్-143) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల ప్రెస్ క్లబ్,యూనియన్ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వికారాబాద్ జిల్లా యూనియన్ అధ్యక్షుడు కంద్లపల్లి రవీంద్ర రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా చౌడాపూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు కామారం రామస్వామి,ప్రధాన కార్యదర్శి యశ్వంత్,ఉపాధ్యక్షుడు ప్రజాజ్యోతి రిపోర్టర్ జోగు శ్రీనివాస్ తదితరులు జిల్లా అధ్యక్షుడు కంద్లపల్లి రవీంద్రతో పాటు జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్,నర్సింహులును శాలువాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమానికి హాజరైన వివిధ రాజకీయ పార్టీల నాయకులను కూడా శాలువాలతో సత్కరించారు.అనంతరం జిల్లా అధ్యక్షుడు కంద్లపల్లి రవీంద్ర మాట్లాడుతూ జర్నలిస్టుల ఐక్యత,సంక్షేమం,హక్కుల పరిరక్షణే యూనియన్ ప్రధాన లక్ష్యమని అన్నారు.జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి యూనియన్ నాయకులు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ఆరోగ్య భద్రత, సంక్షేమ పథకాల అమలు వంటి హక్కుల సాధన కోసం అందరూ ఐక్యంగా పోరాడాలని పేర్కొన్నారు.ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఈ యూనియన్ కార్యాలయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.జర్నలిస్టులు తమ సమస్యలను చర్చించుకోవడానికి,పరస్పర సహకారంతో ముందుకు సాగడానికి ఈ కార్యాలయం ఒక వేదికగా నిలుస్తుందని అన్నారు.ప్రతి జర్నలిస్టుకు యూనియన్ అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు మాట్లాడుతూ సమాజంలో జరిగే మంచి చెడులను ప్రజలకు తెలియజేయడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు.ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడం లో జర్నలిస్టుల సేవలు అభినందనీయమని,జర్నలిస్టులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చౌడపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్,బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,మండల బిజెపి పార్టీ అధ్యక్షులు బి శ్రీనివాస్,పిఎసిఎస్ వైస్ చైర్మన్ అశోక్ చౌడాపూర్ మండల స్థానిక సర్పంచ్ నవీన్ కుమార్,ఉపసర్పంచ్ రాజు,మాజీ జెడ్పిటిసి రాందాస్,మందిపాల్ స్థానిక సర్పంచ్ నాగరాజ్,చౌడాపూర్ సర్పంచ్‌తో పాటు వివిధ గ్రామాల సర్పంచులు,ఎంపీడీవో వెంకయ్య,ఎంఈఓ రామచంద్రయ్య, చౌడాపూర్ మండల టియుడబ్ల్యూజే యూనియన్ హెచ్ 143 అధ్యక్షులు కామారం రామస్వామి, ఉపాధ్యక్షులు ప్రజా జ్యోతి రిపోర్టర్ జోగు శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి యశ్వంత్,పరిగి కాంసెన్సీ కార్యదర్శి కోస్గి కుమార్,మండల కార్యదర్శి పరిగి అశోక్,మండల ఆర్గనైజ్ కార్యదర్శి బి వెంకట్,మండల కార్యదర్శి కొత్త యాదయ్య,కోశాధికారి చందు,సలహాదారులు శేఖర్,కార్యవర్గ సభ్యులు బుచ్చయ్య,కొండయ్య, మొగలిగిద్ద గిరి కార్యవర్గ సభ్యులు నజీర్,పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, చౌడాపూర్ మండల వార్డు సభ్యులు అదేవిధంగా పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు శ్రీనివాసరావు,ప్రధాన కార్యదర్శి సీమ ఆనంద్,కుల్కచర్ల మండల అధ్యక్షుడు నర్సింహులు,దోమ మండల అధ్యక్షుడు రాము,జర్నలిస్టులు సురేష్,రఘు,చారి మరియు చౌడపూర్ మండల అధికారులు అనధికారులు రాజకీయ పార్టీలకు అతీతంగా యువకులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

బాటసింగారంలో కారులో మంటలు.. తృటిలో తప్పిన పెను ప్రమాదం

- కారు పూర్తిగా దగ్ధం.. సురక్షితంగా బయటపడిన భార్యాభర్తలు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 30 (జనం సాక్షి): రంగారెడ్డి జిల్లా బాటసింగారం సమీపంలోని జాతీయ రహదారి-65పై శుక్రవారం కారులో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న హ్యుందాయ్ గ్రాండ్ ఐ10 నియోస్ కారులో ఈ ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే.. విజయవాడకు చెందిన తాడేపల్లి ప్రవీణ్ (33), ఆంధ్రప్రదేశ్ సచివాలయంలో సెక్షన్ అధికారిగా పనిచేస్తున్నారు. ఆయన తన భార్యతో కలిసి కారులో విజయవాడ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తుండగా, బాటసింగారం వద్ద ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా ఒక్కసారిగా కారులో మంటలు చెలరేగాయి.క్షణాల్లోనే మంటలు కారంతటా వ్యాపించడంతో అప్రమత్తమైన స్థానికులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అయితే మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో కారు పూర్తిగా దగ్ధమైంది. అదృష్టవశాత్తూ మంటలు వ్యాపించే సమయంలోనే కారులో ఉన్న భార్యాభర్తలు ఇద్దరూ బయటపడటంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.కారులో మంటలు చెలరేగడానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారుల విచారణలో వెల్లడికావాల్సి ఉంది.

సాయి-సుధీర్ కళాశాలలో మానసిక ఆరోగ్యంపై అవగాహనా సదస్సు

కాప్రా , అక్టోబర్ 30, (జనం సాక్షి): సాయి-సుధీర్ డిగ్రీ,పీజీ కళాశాలలో విద్యార్థులకు మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమతుల్యత, రోజువారీ జీవితంలో ఒత్తిడిని సమర్థవంతంగా ఎదుర్కోవడంపై అవగాహన కల్పించేందుకు "దైనందిన జీవితంలో మనస్తత్వశాస్త్రం: ఆలోచనలు, భావోద్వేగాలు మరియు ప్రవర్తన" అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఇన్ బ్లెస్ మెంటల్ వెల్నెస్ సెంటర్ వ్యవస్థాపకురాలు శ్రీమతి శ్రావ్య రాగా పెన్మత్సా , శ్రీ సాయిరాం రామావత్, క్లినికల్ సైకాలజిస్ట్ శివాంగి, క్లినికల్ సైకాలజిస్ట్ పాల్గొని విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ఆలోచనలు, భావోద్వేగాలు, ప్రవర్తన మధ్య ఉన్న సంబంధాన్ని వివరిస్తూ, అతిగా ఆలోచించడం, ప్రతికూల ఆలోచనలు, ఆత్మవిశ్వాస లోపం, స్వీయ అవగాహన, భావోద్వేగ నియంత్రణ, నిర్ణయాలు తీసుకోవడంలో ఎదురయ్యే సవాళ్లు, సోషల్ మీడియా ప్రభావం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.

కళాశాల చైర్పర్సన్ డా. ఆర్. ఉషారాణి విద్యార్థులకు ఈ సదస్సులో నేర్చుకున్న మానసిక పద్ధతులను తమ దైనందిన జీవితంలో ఆచరిస్తూ ఒత్తిడిని తగ్గించుకోవాలని, ప్రతికూల ఆలోచనలను అధిగమించి సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానోపాధ్యాయులు, అధ్యాపకులు, సిబ్బంది, మరియు విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల సంపూర్ణ వికాసం, మానసిక ఆరోగ్యం, భావోద్వేగ శ్రేయస్సుకు ప్రాధాన్యత నిస్తూ సాయి-సుధీర్ కళాశాల చేపడుతున్న కార్యక్రమాల్లో ఈ సదస్సు ఒక ముఖ్యమైన ముందడుగుగా నిలిచిందని అన్నారు.

యాం మొబైల్స్" షాపు ప్రారంభించిన బిఆర్ఎస్ ఎల్పి వీప్ ఎమ్మెల్యే కెపీ వివేకానంద

కుత్బుల్లాపూర్ అక్టోబర్ 30 (జనం సాక్షి) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 125 - గాజుల రామారం డివిజన్ ఎన్టీఆర్ నగర్ లో హమీద్ ఆధ్వర్యంలో శుక్రవారం నూతనంగా ఏర్పాటు చేసిన "యాం మొబైల్స్" ను బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాక్స్ డైరెక్టర్ పరుశ శ్రీనివాస్ యాదవ్, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, తెలంగాణ సాయి, ఇబ్రహీం ఖాన్, స్థానిక బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

37 ఏళ్ల విద్యా సేవలకు ఘన వీడ్కోలు

ప్రధానోపాధ్యాయురాలు మూసా వనజకు ఘనంగా పదవీ విరమణ సన్మానం

హయత్‌నగర్, అక్టోబర్ 30 (జనం సాక్షి) : హయత్‌నగర్ హెచ్‌డబ్ల్యూ పరిధిలోని ఎంపీపీఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మూసా వనజ పదవీ విరమణ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సురేష్ కుమార్ అధ్యక్షతన ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. గత 37 సంవత్సరాలుగా ఉపాధ్యాయురాలిగా, ప్రధానోపాధ్యాయురాలిగా విద్యారంగానికి విశేష సేవలందించిన ఆమె రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా గుర్తింపు పొందారు. ఈ సందర్భంగా అధికారులు, తోటి ఉపాధ్యాయులు, సహచరులు, విద్యార్థులు పూలవర్షం కురిపిస్తూ ఆమెను ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ ఎంఈఓ శ్రీనివాసులు, ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్, బాలల హక్కుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి రఘునందన్, హయత్‌నగర్ కాంప్లెక్స్ హెచ్‌ఎం రమాదేవి, సాహెబ్‌నగర్ గెజిటెడ్ హెచ్‌ఎం దినేష్, పీఆర్టీయూ హయత్‌నగర్ మండల అధ్యక్షుడు దీన్‌దయాల్, ఎస్టీయూ మండల అధ్యక్షుడు ఏడుకొండలుతో పాటు పలువురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో మూసా వనజ చేసిన కృషి, అందించిన సేవలు అభినందనీయమని కొనియాడారు. 37 ఏళ్ల సుదీర్ఘ విద్యా ప్రస్థానంలో ఆమె ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ, సేవానిరతి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శమని పేర్కొన్నారు.

అనంతరం మూసా వనజ మాట్లాడుతూ తన 37 ఏళ్ల ఉద్యోగ జీవితంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు, అనుభవాలు ఉన్నాయని తెలిపారు. తాను ఈ స్థాయికి ఎదగడంలో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా తన భర్త కృష్ణయ్య అందించిన ప్రోత్సాహం, సహకారం, అండదండలు మరువలేనివని భావోద్వేగంగా తెలిపారు. తన వృత్తి జీవితంలోని ప్రతి అడుగులోనూ తోడుగా నిలిచిన భర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. విద్యారంగానికి మూసా వనజ అందించిన 37 ఏళ్ల సేవలు చిరస్మరణీయమని, పదవీ విరమణ అనంతరం ఆమె జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో నిండాలని ఈ సందర్భంగా పలువురు ఆకాంక్షించారు.

ఇంటి స్థలం వివాదంలో దాడి.. వ్యక్తికి తీవ్ర గాయాలు

దోమ అక్టోబర్ 30 జనం సాక్షి : వికారాబాద్ జిల్లా దోమ మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో ఇంటి స్థలం విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో నరేష్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.బాధితుడు నరేష్ ఆరోపణల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన సర్వర్, అన్వర్, ఆన్సర్, అక్రమ్, ఖాదర్, సఫియా బేగం, దుల అంజిలమ్మ, దుల వెంకటమ్మ, బోయే రవి, బోయే అనిత, నర్సింలు కలిసి తమ కుటుంబంపై గడ్డపారతో దాడి చేసినట్లు నరేష్ ఆరోపించాడు. ఈ దాడిలో తాను తీవ్రంగా గాయపడినట్లు తెలిపారు.ఈ ఘటనపై బాధితుడు దోమ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల విచారణలో పూర్తి వివరాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

వనస్థలిపురంలో మూడు రోజుల ఉచిత ధ్యాన శిక్షణ

హయత్ నగర్, అక్టోబర్ (జనం సాక్షి) : హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో వనస్థలిపురంలో మూడు రోజుల ఉచిత ధ్యాన శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. నవంబర్ 1, 2, 3 తేదీల్లో ప్రతిరోజూ సాయంత్రం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ కార్యక్రమం జరగనుంది. వనస్థలిపురం, సుష్మా సాయి నగర్‌లోని వీఎంర్ గ్రాండ్ రెస్టారెంట్ పక్క రోడ్డులో ఉన్న స్వాతి నివాస్‌లో ధ్యాన శిక్షణ ఇవ్వనున్నారు. 15 సంవత్సరాలు పైబడిన వారందరూ ఈ కార్యక్రమంలో ఉచితంగా పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు కార్యక్రమ ప్రారంభానికి 15 నిమిషాల ముందుగా చేరుకోవాలని సూచించారు. మూడు రోజులూ హాజరై ధ్యాన శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.మరిన్ని వివరాలకు 9133440233 నంబర్‌లో సంప్రదించవచ్చు. టోల్ ఫ్రీ నంబర్ 1800 121 3492. www.heartfulness.org వెబ్‌సైట్ ద్వారా కూడా వివరాలు తెలుసుకోవచ్చు.